క్లుప్తంగా

విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల అందజేత



నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. ఆ తర్వాత ఈ ఏడాది మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మార్కపూడి గురుస్వామి, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షురాలిగా పద్మ



వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయి గ్రామ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలిగా చిలువేరు పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను నియామపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షురాలిగా నియమించడం సంతోకరమని గ్రామంలో పార్టీ పటిష్టతకు మరింత కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, మండల సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, ఉపసర్పంచ్ చింతల ఏడుకొండలు, మాజీ సర్పంచ్ గుత్తా శంకరరావు, మండల బీసీ సెల్ నాయకులు బత్తుల జానకీరాములు, కొలుసు రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలి వచ్చారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు సందర్శించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేలాది వాహనాలు తరలి రావటంతో ఆదివారం పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రం సందడిగా మారింది. ఆంధ్రా నుంచే కాక తెలంగాణ, నుంచి కూడా వందల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

తిరువూరు: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధిస్తేనే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ సూచించారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ ఈ శిక్షణ పొందాలని, రోజూ ఉదయం 9 నుంచి 10.30 వరకు తరగతులు జరుగుతాయని తెలిపారు. 5 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులు ఈ శిక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, తిరువూరు మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- రూ.70 లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమిపూజ



శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, ప్రజాప్రతినిధులు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: అభివృద్ధిలో రోల్ మోడల్‌గా పేటను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాలనీలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.70 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ రూ.14 కోట్లతో చిల్లకల్లు–జగ్గయ్యపేట రోడ్డు నిర్మించామన్నారు. రూ.కోటితో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని, పట్టణంలో ఒక్కొక్కటి రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేపలవాగు, ఎర్రకాలువ అభివృద్ధికి రూ.5 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడిగామని, ఎర్రకాలువ టౌన్ పరిధిలో బహిరంగా కనిపించకుండా స్లాబుతో కప్పివేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ డిజైన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల చిల్లకల్లు రోడ్‌లో టీటీడీ కల్యాణ మండపాన్ని రూ.3 కోట్లతో నిర్మాణం చేపట్టామని, కోదాడ రోడ్‌లో 70 సెంట్ల స్థలంలో షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఇప్పుడు రూ.70 లక్షలతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 4 నెలల్లో నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ పాలనలో నిర్లక్ష్యం..

టీడీపీ పాలనలో టౌన్‌హాల్, టీటీడీ కల్యాణ మండపం, ధనంబోడు కాలనీ నిర్మాణాన్ని పట్టించుకోలేదన్నారు. ఈ తరువాత అధికారంలోకి వచ్చిన తాము టౌన్‌హాల్, ధనబోడు కాలనీని పూర్తిగా అభివృద్ధి చేసి వాడుకలోకి తీసుకువచ్చామని, టీటీడీ కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అన్ని పనులు పూర్తి చేశామన్నారు.

త్వరలో ఇళ్ల పట్టాలు అందజేస్తాం..

పట్టణంలో చిరునగర్, దుర్గాపురం, విద్యానగర్, పద్మావతినగర్, విలియంపేట, ఎన్జీవో కాలనీ, సత్యనారాయణపురం తదితర పలు ప్రాంతాల్లో బీ ఫారంలో గృహాలు నిర్మించుకుని ఇళ్ల పట్టాలు లేని వారిని గుర్తించి వారందరికి త్వరలో పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్లు పూసల పుల్లారావు, సీతారావమ్మ, వట్టెం మనోహర్, ఖాదర్ బాబు, విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు మొహిద్దీన్, చారుగుండ్ల కొండ, నాయకులు తన్నీరు నాగేంద్ర, కాశి కిషోర్, బాలస్వామి, చిరంజీవి, తాళ్లూరి వెంకటేశ్వర్లు, తిరుమలరావు, పంచాయతీ రాజ్ డీఈ కృష్ణ కిరణ్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా ‘వాసవీ’ అమ్మవారి జయంతి



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



ఆలయంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు



అమ్మవారికి తులాభారం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

వత్సవాయి : వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి జయంతోత్సవాలు ఆదివారం వత్సవాయిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా గోపూజ, సామూహిక కుంకుమ పూజలు చేసుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకటరాజారావు, గుర్రం శ్రీధర్, పెరుమాళ్ల మణికంఠ, కొత్తా వెంకటనరసింహారావు, బీఎస్ఎస్ చక్రవర్తి, దుగ్గి శైలజ, గుర్రం కృష్ణవేణి, అడ్డగిరి కళావతి తదితరులు పాల్గొన్నారు

కంచికచర్ల : వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం గంగా యమున నదీ జలాలతో, పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. అమ్మవారికి మహన్యాస పూర్వక, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మల్లెపూలతో అలంకరించారు.108 కలశాలతో అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారి జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేకంగా తీసుకువచ్చిన పుష్కర గంగా జలాలను పట్టణంలో మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అద్దాలబ జారులో ఉన్న అమ్మవారి ఆలయంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి తులాభారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొంకిమళ్ల వెంకటనారాయణ, పెనుగొండ సంపత్‌కుమార్, ఆర్గనైజర్లు కె.సోమేశ్వరరావు, పెనుగొండ రామకృష్ణ తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పద్మశాలీయులకు అండగా ఉంటా



ఉదయభానుకు వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీయ సంఘ కమిటీ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: పద్మశాలీయుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కమిటీ, పెద్దలు ఎమ్మెల్యే ఉదయభానుకు వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెలిమేటి చంద్రమౌళి, భారత జగన్ తదితరులు మాట్లాడుతూ పద్మశాలీయులకు కమ్యూనిటీ భవనం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని కోరారు. శ్మశానవాటిక అభివృద్ధికి రూ.35 లక్షలు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని, మున్సిపల్ నిధులు రూ.20 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి చేస్తామని, అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పద్మశాలీయ సంఘం కోశాధికారి చెరుపల్లి నాగరాజు, కమిటీ సభ్యుడు గోసిక శ్రీనివాసరావు, సంఘ ప్రముఖులు యలదండి శ్రీనివాసరావు, అల్లి కిషోర్, రవిచంద్, యాపిల్ ల్యాబ్ శ్రీను, మెటికల శ్రీనివాసరావు, సంగెపు రాజశేఖర్, కుప్పడపు సురేష్, రఘునాథ్, మహిళా సభ్యులు కర్నాటి రాజేశ్వరి, బొడ్డు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన తిరుపతమ్మ దేశస్థానం ఈఓ



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక తిరుపతమ్మ దేవస్థానం ఈవోగా బాధ్యతలు స్వీకరించిన డెప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈవోగా పనిచేస్తూ బదిలీపై పెనుగంచిప్రోలు వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఉదయభానును ఆయన నివాసంలో కలిసిన ఈవో అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను ఆయనకు శుభాశిస్సులు అందజేశారు.

ఘనంగా పడిపూజ



జయంతిపురం (జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి పడిపూజ కార్యక్రమం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా మండపాన్ని ఏర్పాటు చేసి లక్ష్మీ నరసింహ స్వామి వారికి అర్చకులు వేదాంతం శ్రీధరాచార్యులు, మురళీధరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో దీక్షా స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారికి ఆదివారం గుంటూరు జిల్లా, పిడుగురాళ్లకు చెందిన కనుబొద్దు శివనాగిరెడ్డి, తిరుపతమ్మ దంపతులు రూ.45,116 విరాళంగా అందజేశారు. వీటిలో రూ.15 వేలు నిత్యాన్నదాన పథకానికి, ఉపాలయం అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి రూ.20,116, గోపయ్యస్వామి తలపాగా తయారీకి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్ హెచ్ ఓ

నందిగామ: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్‌హెచ్ఓ సతీష్ సూచించారు. పట్టణంలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. మద్యం సేవించి ఆటో నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆటోల నంబర్ ప్లేట్లు సక్రమంగా ఉండేలా చూడడంతో పాటు డ్రైవర్‌కు కచ్చితంగా లైసెన్స్ ఉండి తీరాలన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ బాధ్యతగా ఉండడంతో పాటు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టుకొని నడిపితే అటువంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎస్ఐలు సురేష్, పండు దొర, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, ఏఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వీరులపాడు: మండలంలోని చౌటపల్లి గ్రామ శివారులో ఆదివారం ఎస్ఐ సోమేశ్వరరావు, పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎస్.అమరవరం (కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన, మెరుగైన అర్థమయ్యేరీతిలో బోధన ఉంటుందని, తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని హెచ్ఎం ఏఎస్ఎస్‌కే శ్రీనివాస మూర్తి అన్నారు. మండలంలోని ఎస్. అమరవరం గ్రామంలో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆదివారం విద్యార్థులతో కలసి ఉపాధ్యా యులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల బ్యాంకు ఖాతాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ప్రభుత్వం ముందుగానే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు, షూ, టైలు, బూట్లు తదితర పరికరాలన్నీ విద్యార్థులకు అందజేస్తుందని ఇంగ్లిష్ బోధన ఉంటుందన్నారు. ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షం...రైతుల అవస్థలు



పట్టాలపై నీటిని బయటకు పంపుతున్న రైతులు

పెనుగంచిప్రోలు: అకాల వర్షం రైతులను పొలాల వైపు పరుగులు పెట్టించింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం, గాలిదుమ్ము వచ్చింది. దీంతో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్నను కాపాడుకోవటానికి పరదా పట్టాలతో పొలాలకు పరుగులు తీశారు. పట్టాలు కప్పుతున్నా గాలిదుమ్ముకు అవి లేచి పోతుండటంతో రైతులు పడరాని పాట్లు పడ్డారు. కోతలకు సిద్ధంగా ఉన్న మామిడి కాయలు నేలరాలాయి. మొక్కజొన్న రాశులపై కప్పిన పట్టాలపై పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరటంతో రైతులు బయటకు పంపించేందుకు ఇబ్బందులు పడ్డారు.

నందిగామ: నందిగామ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. పగటి సమయంలో భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

తిరువూరు: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహోత్సవాన్ని స్థానిక లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి విశేషపూజలు జరిపారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, బ్రహ్మాచారి, కార్యవర్గసభ్యులు రమేష్, సూరిబాబు, కుమారరాజా ఆర్ఆర్‌కే చారి పాల్గొన్నారు.

విద్యార్థులకు బాలవికాస్ తరగతులు

తిరువూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఆటపాటల్లో శిక్షణ ఇచ్చేందుకు బాలవికాస్ తరగతులు ఆదివారం ప్రారంభించినట్లు తిరువూరు సత్యసాయిసేవా సమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు తెలిపారు. మే 6వ తేదీ వరకు రోజూ ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు తిరువూరు కోకిలంపాడు రోడ్డులోని సత్యసాయి భజన మందిరంలో ఈ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్లు మే 10వ తేదీలోగా తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు మొబైల్ ఫోన్ నంబర్‌కు ఆధార్ లింక్ చేయించుకోవాలన్నారు. కొంతమంది పెన్షనర్లు జీవన ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానా కార్యాలయానికి సమర్పించలేదని, వారికి ఏప్రిల్ పింఛన్ నిలిపివేశారని తెలిపారు. ఇప్పటికైనా ఎస్‌టీఓకు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, నాయకులు నాగేశ్వరరావు, బీ కృష్ణమూర్తి, బీవీ సర్వేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీలోగా పెన్షనర్స్ ఈకేవైసీ చేయించుకోవాలి

విస్సన్నపేట: స్థానిక ఎస్టీఓ కార్యాలయం నందు పెన్షనర్స్ ఈ నెల 10వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎస్టీఓ ఎల్.రాజశేఖర్ ఆదివారం తెలిపారు. పెన్షనర్స్ తమ సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఆధార్ కార్డులకు అనుసంధానించిన మొబైల్ నంబర్లతో లింక్ చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎస్టీఓ కార్యాలయంలో ఈకేవైసీ చేయనున్నట్లు తెలిపారు. పెన్షనర్స్ తమ మొబైల్ ఫోన్‌తో కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముచ్చింతాల రోడ్డు వద్ద, పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఆరాధనా ఉత్సవాలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, సంఘ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు వెలిశాల ఏడుకొండలు, జిల్లా క్రమశిక్షణా కమిటీ చైర్మన్ చల్లాల శివాజీ, కోశాధికారి పులికొండ సాంబశివరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నంచర్ల గోపాలరావు, తునికిపాటి శివ, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు తునికిపాటి ఉమాకుమారి, జి రాజేశ్వరి, మండల నాయకులు తునికిపాటి రాంబాబు, రామకృష్ణ, రామాచారి, గోపాచారి, రాంబాబు, పిచ్చయ్యాచారి, జోగయ్యాచారి, హిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురు విశ్వస్ఫూర్తి జయంతి

పెనుగంచిప్రోలు: స్థానిక స్ఫూర్తిధామం వద్ద సోమవారం గురు విశ్వస్ఫూర్తి 83వ జయంతి నిర్వహిస్తున్నట్లు స్ఫూర్తి కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పీఠపూజ అనంతరం విశ్వమానవతా స్ఫూర్తి చైతన్య యాత్ర, పాదపూజ ఉంటుందన్నారు. అనంతరం మహాప్రసాదం అందిస్తామన్నారు. ఈకార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

ఆకట్టుకున్న సూర్యబింబం



వేదాద్రి(జగ్గయ్యపేట): స్థానిక యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలోని కృష్ణానదిలో వేంచేసియున్న సాలగ్రహ నరసింహ స్వామిపై సూర్యుని ప్రతిబింబం స్సాక్షాత్కరించింది. ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయ సమయంలో కృష్ణానదిలోని సూర్యుడి ప్రతిబింబం సాలగ్రామ నరసింహ స్వామిపై పడి కనుల విందుగా దర్శమిచ్చింది. కల్యాణోత్సవాల ప్రారంభం రోజున ఈ దృశ్యాన్ని భక్తులు ఆసక్తిగా భక్తిశ్రద్ధలతో తిలకించారు.